

రానున్న మూడు రోజులూ

పగలు సెగలే!



చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజులు ఎండలు మండిపోనున్నాయి. మరీ ముఖ్యంగా ఉత్తర, మధ్య తమిళనాడులో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. కొన్ని చోట్ల వడగాడ్పులు కూడా ఉండవచ్చని, ప్రజలు బయట సంచరించవద్దని సూచించింది. గురువారం ఉత్తర తమిళనాడు జిల్లాల్లో 40 డిగ్రీల సెల్సియస్, దక్షిణాదిన 39 డిగ్రీల సెల్సియస్, సముద్ర తీర ప్రాంతాల్లో 38 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఇక ఈరోడ్, సేలం, పరమత్తివేలూరు, తిరుపత్తూరు, ధర్మపురి, తిరుచ్చి, నామక్కల్, వేలూరు తదితర ప్రాంతాల్లోనూ ఇంతకంటే ఎక్కువస్థాయిలో ఉష్ణోగ్రత ఉక్కిరిబిక్కిరి చేసింది.



మెరీనాలోని ఈతకొలనులో సేద తీరుతున్న యువత

పెరిగిన ఏసీ విక్రయాలు

గత పది రోజుల్లో నగరంలో ఎండలు పెరగడంతో ఏసీ విక్రయాలు రెండింతలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఎండల తీవ్రత జూన్ నెలాఖరు వరకు ఉంటుందని వాతావరణశాఖ ఇప్పటికే ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 1500 ఏసీలు విక్రయిస్తున్నామని, ఒక్క చెన్నైలోనే 500కు పైగా అమ్ముతున్నామని ఓ ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయించే సంస్థ ప్రకటించింది.

అమ్మో... బీర్లు!

చల్లచల్లని బీర్ల విక్రయాలకు హద్దే లేకుండాపోయింది. ప్రస్తుతం రోజుకు 12 లక్షల బీర్లు విక్రయమవుతున్నట్లు టాస్మాక్ అధికారులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇది రెండింతలని వివరించారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మందుబాబులు బీర్లను ఆశ్రయిస్తున్నారు. అదేవిధంగా కొబ్బరినీరు, తాటిముంజలు, పుచ్చకాయలు వంటి వాటి విక్రయాలూ ఊపందుకున్నాయి.



సభకు హాజరైన జనం

సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

బీజేపీ పాలనలో మైనార్టీలకు రక్షణ కరువు

- మరోసారి అవకాశమిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు
- ఈ ఎన్నికలు మరో స్వాతంత్ర్య పోరాటం
- విక్రవాండి ఎన్నికల ప్రచార సభలో సీఎం స్టాలిన్

పెరంబూర్, ఏప్రిల్ 5: బీజేపీ పాలనలో రాష్ట్రాల హక్కులు హరించడమే కాకుండా, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని, అలాంటి పార్టీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి విక్రవాండిలో విల్లుపురం నియోజకవర్గ డీపీఐ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రవికుమార్, కడలూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ విష్ణుప్రసాద్‌కు మద్దతుగా శుక్రవారం రాత్రి బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఈ సభలో మంత్రులు పొన్ముడి, ఏవీ వేలు, ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, సెంజి మస్తాన్, గణేశన్, ఎంపీ గౌతమ శిఖామణి, రాజ్యసభ ఎంపీ షణ్ముగం, ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ... ఇండియా కూటమి ప్రధాని ఢిల్లీ ఎర్రకోటలో జెండా ఎగురవేసే రోజు త్వరలోనే వస్తుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు రెండో స్వాతంత్ర్య పోరాటంగా అభివర్ణించారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం నూరేళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. ఈ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఉండవని, సామాజిక న్యాయానికి విఘాతం కలుగుతుందన్నారు. జాతి, మతం పేరిట విద్వేషాలు సృష్టించేలా బీజేపీ ప్రభుత్వ పాలన సాగుతోందని విమర్శించారు. అలాంటి బీజేపీని గద్దెదించేందుకు సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న పార్టీలతో 'ఇండియా' కూటమి ఏర్పడిందన్నారు. ఎన్నికల కోసమే కాకుండా సిద్ధాంతపరంగా కూటమి ఏర్పాటు చేశామని తెలిపారు. బీజేపీ అధికారం లేని రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా పోటీ ప్రభుత్వాన్ని సాగిస్తున్నారన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యారంగాన్ని తమ చేతులోకి తీసుకొనేలా బీజేపీ ప్రభుత్వ చర్యలు చేపట్టిందని అన్నారు. అలాంటి బీజేపీ పార్టీతో పీఎంకే ఎందుకు జతకట్టిందో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు రాష్ట్ర ఖజానా ఖాళీ చేసిన వెళ్లిన అబద్ధాల పళనిస్వామి, తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సినిమాల్లో గౌండర్ మణి చేసే కామెడీలా ఉందన్నారు. తాను అందజేస్తున్న ప్రోత్సాహక నిధిని మహిళలు 'స్టాలిన్ అందిస్తున్న పుట్టింటి సారె'గా భావిస్తున్నారని అన్నారు. మరోవైపు పేద విద్యార్థులు విద్యకు దూరం కారాదనే సంకల్పంతో ఉదయం అల్పాహారం పథకం అమలుచేశామన్నారు. రాష్ట్రంలో తుపాను, వరదలు తదితర ప్రకృతి వైపరీత్యాల సమయంలో కన్నెత్తి కూడా చూడని ప్రధాని.. ప్రస్తుతం రాష్ట్రానికి తరచూ వస్తున్నారన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు పర్యటించిన ప్రధాని, మరో నాలుగు సార్లు పర్యటించనున్నారని, ఆయన ఎన్ని సార్లు పర్యటించినా రాష్ట్రంలో బీజేపీ కాలుమోపే అవకాశం లేదన్నారు. డీఎంకే ఉన్నంత వరకు ఆయన ప్రయత్నాలు ఫలించవని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో 40 స్థానాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా ప్రజా తీర్పు ఉంటుందని సీఎం స్టాలిన్ తెలిపారు.

8050 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు

- చెన్నైలో 902
- రాయపురం, కొళత్తూరు, ఆర్‌కే నగర్‌లలోనే అధికం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సత్యప్రద సాహు తదితరులు

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 8050 సమస్యాత్మక పోలింగ్‌బూత్‌లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఇందులో చెన్నైలోనే 902 ఉండగా, అందులోనూ రాయపురం, కొళత్తూరు, ఆర్‌కే నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధికమని కమిషన్ పేర్కొంది. శుక్రవారం కేంద్ర ఎన్నికల కమిషన్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశమైన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు ఈ వివరాలను వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈనెల 19న రాష్ట్రంలో మొదటి విడతలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 68,320 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుకు ఉపక్రమించింది. ఇందులో 8050 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకమైనవిగా గుర్తించింది. ఇందులోనూ 181 పోలింగ్ బూత్‌లు అత్యంత సమస్యాత్మకమైనవిగా పేర్కొంది. సమస్యాత్మక బూత్‌లలో అధికశాతం మదురై నియోజకవర్గంలో 511, దక్షిణ చెన్నై 456, తేనిలో 381, తిరువళ్లూరులో 170, ఉత్తర చెన్నైలో 254, సెంట్రల్ చెన్నైలో 192, శ్రీపెరంబుదూర్‌లో 337, కాంచీపురంలో 371 వున్నట్లు గుర్తించింది. చెన్నై మొత్తమ్మీద 902 సమస్యాత్మకమైనవి ఉండగా, ఉత్తర చెన్నైలో భాగమైన రాయపురం, కొళత్తూరు, ఆర్‌కేనగర్‌లలో 18 బూత్‌లు అత్యంత సమస్యాత్మకమైనవిగా ఈసీ ప్రకటించింది. ఇక్కడ సాయుధ బలగాల పహారా, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని ఈసీ నిర్ణయించింది. ఎన్నికల పరిశీలకులు ఆ బూత్‌లకు నేరుగా వెళ్లి సమీక్షించనున్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- సీఎంకు ఈపీఎస్ సవాల్



పెరంబూర్, ఏప్రిల్ 5: తమ ప్రభుత్వ హయాంలో ఏమేం చేశామో, ఇప్పటి డీఎంకే ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు వివరించేందుకు బహిరంగ చర్చకు సిద్ధమా అని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి... ముఖ్యమంత్రి స్టాలిన్‌కు సవాల్ విసిరారు. కోయంబత్తూర్ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థికి మద్దతుగా జరిగిన బహిరంగ సభలో ఈపీఎస్ మాట్లాడుతూ... స్టాలిన్ ఎక్కడికి వెళ్లినా అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. తమ కూటమి బలంగా ఉందని 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో గెలుస్తామని భావిస్తున్నారని, అవి పగటి కలలుగానే మిగిలిపోతాయన్న విషయం ఆయనకు తెలియడం లేదన్నారు. అధికారం, డబ్బుతో ఎన్నికల్లో గెలవలేరని, ప్రజాదరణతోనే సాధ్యమన్న విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. తమకు పుష్కలంగా ప్రజాబలం ఉందన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న వారు బాధ్యతగా మాట్లాడాల్సిన అవసరం ఉందని, నాగరికత తెలియని వ్యక్తిలాగా స్టాలిన్ మాటలున్నాయని ఎద్దేవా చేశారు. ఆయన చెన్నై నగరం నుంచి వచ్చారని, తాను గ్రామం నుంచి వచ్చానని, ఆయనలా ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడడం తనకు తెలియదన్నారు. మూడేళ్లలో డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ప్రజలను ఓట్లు అడిగే ధైర్యముందా అని ప్రశ్నించారు. బహిరంగ సభల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి చెప్పుకోలేని స్టాలిన్, అన్నాడీఎంకేను నిందించడంపైనే దృష్టి సారిస్తున్నారని విమర్శించారు. బీజేపీని చూసి అన్నాడీఎంకే భయపడుతోందని ఆయన మాట్లాడుతున్నారని, తమకు అలాంటి భయాలు లేవన్నారు. రెండు వేషాలు వేసే సంస్కృతి తమది కాదన్నారు. ప్రతిపక్షనేతగా ఉన్న కరుణానిధి 'గో బ్యాక్ మోదీ' అంటూ నల్లజెండాలు ప్రదర్శించారని, ప్రస్తుతం ఆరుసార్లు ప్రధానిని రాష్ట్రానికి రప్పించలేదా అంటూ ప్రశ్నించారు. లోపాయికారి మద్దతు, అంతర్గత కూటమి అంటూ తమపై నిందలు వేస్తున్నారని, తాము ఎప్పుడో బీజేపీని వదిలి బయటకొచ్చామని పళనిస్వామి స్పష్టం చేశారు. కానీ స్టాలిన్ బృందం నిత్యం మోదీతో టచ్‌లో ఉండి వంగివంగి దండాలు పెడుతోందని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో రాజకీయ మార్పు తథ్యం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై
- కోవైలో విస్తృత ప్రచారం



ప్రజలకు అన్నామలై అభివాదం

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ మార్పు తథ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కోయంబత్తూరు లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అన్నామలై పేర్కొన్నారు. అన్నామలై శుక్రవారం సూలూరు, గాంగేయం పాలయం, సామలాపురం తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో కోవై ఎంపీగా ఉన్న వ్యక్తి ఈ ప్రాంతానికి కేంద్ర పథకాలను తీసుకురాలేక పోయారన్నారు. పదేళ్లుగా ప్రధాని మోదీ అద్భుతమైన పాలన అందిస్తున్నారని, అందుకే ప్రజలు మళ్లీ ఆయనకు పట్టంకట్టాలని నిర్ణయించుకున్నారన్నారు. ఈ సారి 400 సీట్లు తమకు సొంతంగా రావడం ఖాయమన్నారు. 'మనకు అవసరమైనవి మనమే అడిగి తెచ్చుకోవాలంటే నన్ను గెలిపించండి. 19వ తేదీ నుంచే రాష్ట్రంలో మార్పు ప్రారంభమవుతుంది. మార్పును కోరుకునే కోవై ప్రజలు నావైపే నిలబడతారన్న నమ్మకం వుంది' అని అన్నామలై అన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వం సరిగ్గా పని చేయడం లేదని, గత్యంతరం లేనిస్థితిలో ప్రజలు స్వచ్ఛందంగా అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు. కరెంటు చార్జీలు పెరగడంతో పరిశ్రమలు మూతబడుతున్నాయని, తద్వారా సరైన ఉద్యోగాలు లభించడం లేదన్నారు. తనను గెలిపిస్తే ఈ సమస్యకు పరిష్కారం చూపుతానన్నారు. 'పవర్‌టెక్స్' పథకాన్ని మళ్లీ తీసుకువస్తామన్నారు. కోవైలో గత రెండు నెలలుగా తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తిందని, అయినా ప్రభుత్వానికి చీకకుట్టినట్టు లేదన్నారు.

మద్రాస్ వర్శిటీలో ఘనంగా ఉగాది వేడుకలు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న తెలుగు ప్రముఖులు

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ యూనివర్శిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'క్రోధి ఉగాది వేడుకలు' శుక్రవారం ఘనంగా జరిగాయి. గాయని అరుణాశ్రీనాథ్ 'మా తెలుగు తల్లికి...' ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి అతిథి ఉపన్యాకుడు డాక్టర్ పాండురంగం కాళియప్ప స్వాగతం పలుకగా, తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ రచయిత భువన చంద్ర ఉగాది పర్వదినం తెలుగువారికి ప్రత్యేకమైనదని, అలాంటి రోజుని తెలుగుశాఖలో, తెలుగువారి మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రారంభ సమావేశంలో భాగంగా కమలాకర రాజేశ్వరి ఉగాది విశిష్టతను శ్రోతలకు తెలియజేయగా, డాక్టర్ టీఆర్ఎస్ శర్మ పంచాంగ పఠనం గావించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి భువనచంద్ర మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. లింగంనేని సుజాత రచించిన 'మనిషి కథలు' (కథా సంపుటి)ని తన భర్త ఆచార్య లింగంనేని బసవ శంకరరావుకి అంకితం ఇచ్చారు. ఈ గ్రంథాన్ని డాక్టర్ తిరుమల ఆముక్త మాల్యద సమీక్షించారు. అదే విధంగా జనని వ్యవస్థాపకుడు గుడిమెట్ల చెన్నయ్య రచించిన 'ఎక్కడుంది న్యాయం?' (కవితా సంపుటి)ని డాక్టర్ మామిడి మురళి సమీక్షించారు. అంతేగాక డాక్టర్ విశ్వర్షి వాసిలి వసంత కుమార్ రచించిన 'జీవన సంహిత' (కవితాత్మికలు) పుస్తకాన్ని ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ సమీక్షించారు. కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు బూసి వెంకటస్వామికి మద్రాస్ యూనివర్శిటీ క్రోధి నామ సంవత్సర తెలుగు ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ... ఈ పురస్కారం అందుకోవడం తన అదృష్టమని వ్యాఖ్యానించారు. అనంతరం కవి సమ్మేళనంలో 60 మంది కవులు తమ కవితలు చదివి వినిపించారు. చివరగా ఏర్పాటు చేసిన 'ఆనంద లహరి' (సంగీత కార్యక్రమం) ఎంఆర్ సుబ్రహ్మణ్యం సారథ్యంలో అరుణా శ్రీనాథ్, నిడమర్తి వసుంధరాదేవి, వంజరపు శివయ్య, జె.తిరుపతయ్య, ఆచార్య విస్తాలి ఎంతో చక్కటి సంగీతం ద్వారా శ్రోతలకు వీనుల విందు అందించారు. ఈ కార్యక్రమానికి పలువురు తెలుగు ప్రముఖులు హాజరయ్యారు.

రంజాన్ వేళలు

శనివారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.28

ఆదివారం : సహర్ : ఉదయం - 4.20



'మిస్టర్ 29 పైసా మోదీ'

- ఆయన్ని అలాగే పిలవాలి
- తంజావూరు ప్రచారంలో ఉదయనిధి



పట్టుకోట్టైలో ఉదయనిధి ప్రచారం

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): "మన రాష్ట్రం నుంచి జీఎస్టీ ఒక్క రూపాయి కేంద్రానికి వెళ్తుంటే, కేంద్రం మాత్రం మనకు కేవలం 29 పైసలు మాత్రమే ఇస్తోంది. కానీ బీజేపీ పాలిత ప్రాంతాలైన ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్రానికి రూపాయి జీఎస్టీ వస్తే, అందుకు ప్రతిగా ఆ రాష్ట్రానికి రూ.3 తిరిగి ఇస్తోంది. అలాగే బీహార్‌కు రూ.7 ఇస్తున్నారు. అందువల్ల ఈ సారి ప్రధానిని రాష్ట్ర ప్రజలు కలిస్తే 'మిస్టర్ 29 పైసా మోదీ' అనే పిలవండి. ఎందుకంటే 29 పైసలనేది ఈ రోజు చెల్లని పైసా. వచ్చే ఎన్నికల తరువాత మోదీ కూడా చెల్లని కాసులాగే మిగిలిపోతారు" అని రాష్ట్ర మంత్రి, డీఎంకే యువజన విభాగ అధ్యక్షుడు ఉదయనిధి ఎద్దేవా చేశారు. తంజావూరు డీఎంకే అభ్యర్థి మురసొలికి మద్దతుగా శుక్రవారం పట్టుకోట్టైలో ప్రచారం చేపట్టిన ఉదయనిధి కేంద్రప్రభుత్వ విధానాలపైనా, ప్రధానమంత్రి నరేంద్రమోదీపైనా నిప్పులు చెరిగారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మోదీ గ్యాస్ సిలిండర్‌కు ధర రూ.100 తగ్గించారని గుర్తు చేస్తూ గ్యాస్ ధర రూ.450 నుంచి రూ.1200కు పెంచింది ఆయన ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఇండియా కూటమి గెలిస్తే నీట్‌ను రద్దు చేస్తామని, గ్యాస్ సిలిండర్ రూ.500కే ఇస్తామని, పెట్రోల్ లీటరు రూ.75, డీజిల్ రూ.65కే ఇస్తామని ఇప్పటికే సీఎం స్టాలిన్ మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తు చేశారు. అందువల్ల ప్రజలు తమ కూటమి అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈసారి 40కి 40 నియోజకవర్గాల్లో తమ కూటమిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర హక్కులను సాధించుకోవాలంటే ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

సమాచార దర్శిని

రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్యకళాశాలలు

● ఎన్ఎంసీకి దరఖాస్తుల సమర్పణ

పెరంబూర్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో కొత్తగా ఐదు ప్రైవేటు వైద్యకళాశాలల ఏర్పాటుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)కి దరఖాస్తు చేసుకున్నారు. కొత్త వైద్యకళాశాలల ఏర్పాటు, వైద్య కోర్సుల సీట్లు పెంపు తదితరాలకు ఎన్ఎంసీ అంగీకారం పొందాల్సి ఉంది. అందుకోసం జాతీయస్థాయిలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. విల్లుపురం జిల్లా ఒంగూర్‌లో తక్షశిల వైద్యకళాశాల, విరుదునగర్ జిల్లా కృష్ణన్‌కోయిల్‌లో కలశలింగం వైద్యకళాశాల, కాంచీపురం జిల్లా పెన్నలూరులో అన్నై వైద్య కళాశాల, విల్లుపురం జిల్లా ఆవనంపట్టులో జేఆర్ వైద్యకళాశాల, కన్నియాకుమారి జిల్లా కల్‌కుళంలో కన్నియాకుమారి వైద్యపరిశోధన మిషన్ కళాశాలల ఏర్పాటుకు అనుమతులు కోరుతూ దరఖాస్తులు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 5: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

● నెం.07191 కాచిగూడ - మదురై స్పెషల్ (సోమవారం) ఈనెల 8 నుంచి జూన్ 24వ తేది వరకు, నెం.07192 మదురై - కాచిగూడ స్పెషల్ (గురువారం) ఈ నెల 10 నుంచి జూన్ 26వ తేది వరకు పొడిగించారు.

● నెం.07435 కాచిగూడ - నాగర్‌కోయిల్ స్పెషల్ (శుక్రవారం) ఈ నెల 5 నుంచి జూన్ 28వ తేది వరకు, నెం.07436 నాగర్‌కోయిల్ - కాచిగూడ స్పెషల్ (ఆదివారం) ఈ నెల 7 నుంచి జూన్ 30వ తేది వరకు పొడిగించారు.

● నెం.07189 నాందేడ్ - ఈరోడ్ స్పెషల్ (శుక్రవారం) ఈనెల 5 నుంచి జూన్ 28వ తేది వరకు, నెం.07190 ఈరోడ్ - నాందేడ్ స్పెషల్ (ఆదివారం) ఈ నెల 7 నుంచి జూన్ 30వ తేది వరకు పొడిగించారు.

● నెం.07153 నరసాపూర్ - బెంగుళూరు స్పెషల్ (వయా- కాట్పాడి, జోలార్‌పేట) ఈనెల 5 నుంచి 26వ తేది వరకు, నెం.07154 బెంగళూరు-నరసాపూర్ స్పెషల్ ఈ నెల 6 నుంచి 27వ తేది వరకు పొడిగించారు.

ముడిచూర్ జలాశయం అభివృద్ధి

ఐసిఎఫ్, ఏప్రిల్ 5: స్థానిక తాంబరం సమీపంలోని ముడిచూర్ జలాశయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. రూ.100 కోట్లతో ముడిచూర్ జలాశయం, మాడపాక్కం, చెంబాక్కం, వేళచ్చేరి, ఆదంబాక్కం, అయనంబాక్కం జలాశయాల్లో పూడికతీతతో పాటు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించింది. వీటిలో వాహన పార్కింగ్, పిల్లల క్రీడా మైదానం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కిలో నిమ్మపండ్లు రూ.110

ఐసిఎఫ్, ఏప్రిల్ 5: వినియోగం పెరగడంతో నిమ్మ పండు కిలో రూ.110 విక్రయమవుతున్నాయి. రాష్ట్రంలో తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి, తేని జిల్లాల్లో నిమ్మ పండ్లు సాగు చేస్తున్నారు. అలాగే, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి కోయంబేడు మార్కెట్‌కు నిమ్మ పండ్లు దిగుమతి అవుతున్నాయి. వేసవి ప్రారంభం కావడంతో వినియోగం పెరిగింది. ఈ కారణంగా కిలో రూ.110కు వ్యాపారులు విక్రయిస్తున్నారు.

గంటలో ముగిసిన ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

8న ప్రత్యేక రైళ్లు

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో భాగంగా చెపాక్ స్టేడియంలో ఈనెల 8వ తేది రాత్రి 7.30 గంటలకు చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్కే)- కోల్‌కత్తా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్ టిక్కెట్ల విక్రయం శుక్రవారం ఉదయం ప్రారంభమవుతుందని సీఎస్కే యాజమాన్యం ప్రకటించింది. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన గంటలోపే అన్ని టిక్కెట్లు విక్రయమయ్యాయి. దీంతో, టిక్కెట్ల కోసం 6 గంటల నుంచే వేచి ఉన్న అభిమానులు నిరాశ చెందారు. ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా అభిమానుల కోసం వేళచ్చేరి - చింతాద్రిపేట - వేళచ్చేరి మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. క్రికెట్ మ్యాచ్‌లు జరుగనున్న ఈ నెల 8, 23, 28, ఏప్రిల్ 1, 24, 26 తేదీల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. మ్యాచ్ ముగిసిన అనంతరం చింతాద్రిపేట నుంచి రాత్రి 11.15, 11.20, 11.40, 11.45 గంటలకు వేళచ్చేరికి నాలుగు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం



ప్రమాదానికి గురైన కారు

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా కుమారపాళయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. కుప్పండపాళయం సమీపంలో వస్తున్న కారు హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి తాటి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో శ్రీరాంపాళయానికి చెందిన లోకేష్, ధనశేఖర్, కవిన్, శివ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, శ్రీధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శ్రీధర్‌ను ఆసుపత్రికి తరలించారు. అలాగే, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సెంటర్‌ను శుక్రవారం పరిశీలిస్తున్న ఎన్నికల పోలీసు శాఖ సూపర్‌వైజర్ డాక్టర్ సత్యజిత్ నాయక్

వెయ్యి మాసాల పుణ్యఫలం 'షబేఖదర్'

● నేడు సతామీ పర్వదినం
● దేవదూతలు దిగివచ్చిన రాత్రి
● విద్యుద్దీపాలతో కళకళలాడుతున్న మసీదులు



ప్యారీస్, ఏప్రిల్ 5: ముస్లింలకు రంజాన్ మాసం పరమ పవిత్రమైనది. ఈ మాసంలో 30 రోజుల పాటు కఠోర ఉపవాసదీక్ష చేపడతారు. ఈ 30 రోజులను మూడు భాగాలుగా విభజించారు. చివరి పది రోజులకు మరింత ప్రత్యేకత ఉంది. వెయ్యి మాసాల కన్నా ఎక్కువ పుణ్యఫలం అందించే మహారాత్రి 'షబేఖదర్' ఈ చివరి పది రోజుల్లో వస్తుంది.

రంజాన్ మాసానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఫిత్రా ఆదేశాలు కూడా రంజాన్ మాసంలో అవతరించాయి. ఫిత్రా (దానం) వల్ల పేదలకు ఆర్థికంగా కాస్త ఊరట లభిస్తుంది. ఈ శుభప్రద మాసంలో ప్రపంచవ్యాప్తంగా ఎటు చూసినా శాంతి శ్రేయాలే దర్శనమిస్తాయి. ఈ మాసానికి ప్రాముఖ్యం కలగడానికి కారణం పవిత్ర 'ఖుర్ - ఆన్' అవతరించి దేవదూతలు ఒక రాత్రి వేళ దివి నుంచి భువికి దిగిరావడం. ఆ రాత్రిని 'లైలాతుర్ ఖద్ర్' 'షబేఖదర్' (అమూల్యమైన రాత్రి)గా దివ్య ఖురాన్‌లో పేర్కొనడం గమనార్హం.

ఈ రాత్రి 27వ రేయేనా...?

లైలాతుర్ ఖద్ర్ అంటే సౌభాగ్యాల, దౌర్భాగ్యాల నిర్ణయం జరిగే రాత్రి అని అర్థం. అదృష్టాలను మెరుగుపరచే లేదా చెరిపివేసే రాత్రి అని ఇస్లాం మతగురువులు చెబుతున్నారు. ఈ రాత్రి ఎంతో ఘనమైన, విలువైన, శుభకరమైన, మహత్వకరమైన గౌరవాదరణ రాత్రి అని, వెయ్యి నెలల కన్నా ఉత్తమమైన రాత్రి అని, తమ అల్లాహ్ అనుమతితో దేవదూతలు ఈ రాత్రి దిగివస్తారని, వారిని ఘనంగా ఆహ్వానించేందుకు తామంతా రాత్రంతా నిద్రపోకుండా జాగరణ చేసి భక్తిగా ప్రార్థనలతో గడుపుతామని ముస్లిం మతపెద్దలు విశదీకరించారు.



బేసి రాత్రులు...

హజరత్ ఉబదాబిన్ సామిత్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త లైలతుర్ ఖద్ర్ రంజాన్ మాసం చివరి పది రాత్రుల్లో బేసి రాత్రులు అంటే 21, 23, 25, 27, 29 రాత్రులు అని అన్నారు. ఈ ఐదు రాత్రుల్లో ఏదైనా ఒకటి షబేఖదర్ కావచ్చు. అయితే 27వ రాత్రి మహిమాన్విత రేయి కావడానికి ఎక్కువ అవకాశాలున్నాయని మహా ప్రవక్త, వారి అనుచరుల కొన్ని ఉల్లేఖనాలను బట్టి తెలుస్తుంది. అందుకే ఇస్లామిక్ కాలమాన ప్రకారం రంజాన్ మాసంలోని 21 మొదలు 29 వరకు ఈ ఐదు రాత్రుల్లో ప్రత్యేక ఆరాధనలు చేసినప్పటికీ 27వ రాత్రి పైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ రాత్రి చేసే ప్రార్థనలు, సత్కార్యాలు ఇతర వెయ్యి మాసాల్లో చేసే వాటి కన్నా ఎంతో శ్రేష్ఠమైనవిగా పేర్కొన్నారు.

మసీదులు ముస్తాబు...

వెయ్యి మాసాల పుణ్యఫలం దక్కే షబేఖదర్ దివ్యరాత్రి జాగరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా మసీదులు, దర్గాలు ముస్తాబయ్యాయి. ఈ ఏడాది రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 12న ప్రారంభమయ్యాయి. ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు సతామీ పర్వదినం రాత్రంతా నిద్రపోకుండా తెల్లవార్లు జాగారం చేసి ప్రార్థనల్లో గడుపుతారు. ఇందుకోసం మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేశారు. మరోవైపు రాష్ట్ర పోలీసు శాఖ దర్గాలున్న ప్రాంతాల్లో బందోబస్తు పటిష్ఠం చేసింది.

మానవాళికి మార్గదర్శం 'ఖుర్ - ఆన్'

మానవుడు పుట్టింది మొదలు మరణించే వరకు వివిధ దశల్లో ఎలా మసలుకోవాలో 'ఖురాన్'లో స్పష్టంగా చెప్పబడింది. ఇంతటి మహద్భాగ్యాన్ని 'షబేఖదర్'లో అవతరింపజేసేందుకు ఆ రాత్రి చేసే ఆరాధనలు కూడా అంత గొప్పవి.



సమస్త ఉపదేశాలు, ఆరాధనల ఉద్దేశం మానవులను నైతికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా, ఆరోగ్యపరంగా అన్ని విధాలుగా సంస్కరించడమే. ఇంతటి మహజ్వలమైన రాత్రిని సద్వినియోగం చేసుకోవడానికి ఇస్లామీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో దైవారాధనలో గడుపుతారు.

భక్తులకు మజ్జిగ అందజేసిన దుర్గా స్టాలిన్



భక్తులకు మజ్జిగ అందిస్తున్న దుర్గా స్టాలిన్

వేలూరు, ఏప్రిల్ 5: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ సందర్శించారు. అరుణాచలేశ్వరుడు, ఉన్నామలై అమ్మన్ సన్నిధులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దుర్గా స్టాలిన్ మజ్జిగ పంపిణీ చేశారు.

ఎన్ఎల్‌సీకి అవార్డుల పంట



నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ప్లాంట్

అడయార్, ఏప్రిల్ 5: నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్‌కి అవార్డుల పంట పడింది. ఎన్ఎల్‌సీఐఎల్ థర్మల్ యూనిట్, ఎన్ఎన్‌టీపీఎస్, టీపీఎస్-1 ఎక్స్‌పాన్షన్‌కు దేశంలోని లిగ్నైట్ పవర్ కార్పొరేషన్లకు ఇచ్చే అవార్డుల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ మూడు ప్లాంట్లలో మొదటి రెండు ప్లాంట్లు తమిళనాడులో ఉండగా, మూడోదైన టీపీఎస్ రాజస్థాన్ రాష్ట్రంలోని బర్సింగ్‌సర్‌లో ఉంది. తాజాగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ అనే అంశంపై విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం సీఈఏ, ఎన్ఎన్‌టీపీఎస్ మొదటి రెండు స్థానాల్లో నిలవగా, టీపీఎస్ మూడో స్థానాన్ని దక్కించుకుందని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పేర్కొన్నారు. ఆల్ ఇండియా సెంట్రల్ సెక్టార్ థర్మల్ పవర్ స్టేషన్లలో 2024 మార్చి నెలాఖరుకు ఎన్ఎన్‌టీపీఎస్ పీఎల్ఎఫ్ 98.21 శాతంతో రెండో ర్యాంకును దక్కించుకుంది. అలాటే, పీఎల్ఎఫ్ 97.92 శాతంతో టీపీఎస్-1 ఎక్స్‌పాన్షన్ మూడో స్థానంలో నిలిచిందని ఆయన వివరించారు.

పళవేర్కాడులో విదేశీ పక్షుల సందడి



ఐసిఎఫ్, ఏప్రిల్ 5: తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడులో 2,000లకు పైగా విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. విదేశాలు, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వలస పక్షులు మొదట పళవేర్కాడులో బసచేసి అనంతరం వివిధ పక్షుల శరణాలయాలకు వెళ్తుంటాయి. ఆగస్టులో వచ్చిన ఈ పక్షులు మేలో తిరిగి స్వస్థలాలకు బయలు దేరుతాయి. ఈ విషయమై ఆ ప్రాంతానికి చెందిన 'ది నేచర్ ట్రస్ట్' నిర్వాహకులు మాట్లాడుతూ... పళవేర్కాడులో ప్రస్తుతం 2,200కు పైగా రకాల పక్షులున్నాయని, కొంగలు, బాతులు, నీటి బాతులు వంటివి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు.

కొడైకెనాల్‌లో అడుగంటిన జలపాతాలు



ఎండిన స్థితిలో పాంబార్‌పురం జలపాతం

ఐసిఎఫ్, ఏప్రిల్ 5: దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో ఎండ తీవ్రత కారణంగా జలపాతాలు ఎండిపోతున్నాయి. ఈ ప్రాంతంలో ఇటీవల ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. అడవులు మాత్రమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో మొక్కలు, చెట్లు కూడా వాడిపోతున్నాయి. వెల్లి, పాంబార్‌పురం, వట్టకానల్, కరడిచోలై జలపాతాలు ఎండిపోయాయి. ఇక్కడకు వస్తున్న పర్యాటకులు జలపాతాల్లో నీరు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

మెగా ఉద్యోగ అవకాశాల మేళా

వేలూరు, ఏప్రిల్ 5: తిరువళ్లూర్ యూనివర్శిటీ అనుబంధ కళాశాలల్లో చేరే విద్యార్థులకు వృత్తి విద్యకు సంబంధించిన ఉద్యోగ అవకాశాల మేళా సేర్కాడులోని వర్శిటీ ప్రాంగణంలో జరిగింది. ఇండియన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై, ఫాక్స్‌కాన్ హే ఇండియా ప్రైవేటు లిమిటెడ్ చెన్నై సహా పలు సంస్థలు ఈ మేళాలో పాల్గొని, ఉన్నత విద్య అనంతరం ఉద్యోగ అవకాశాల గురించి వివరించాయి. మేళాను వర్శిటీ ఆర్గనైజర్ డాక్టర్ ఎం.సయ్యద్ అలి ఏర్పాటు చేయగా, లెక్చరర్ ఆర్ముగం, వైస్ ఛాన్సలర్, లెక్చరర్ సెందిల్ వేల్ మురుగన్ పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇరకట్ల నాగభూషణం, కావలి సుకుమార్ తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 5: అణగారిన వర్గాల అభ్యుదయానికి అలుపెరగని కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని ~~పలు తెలుగు సంఘాల ఆధ్వర్యంలో~~ ఘనంగా నివాళి అర్పించారు. చెపాక్ ఎళిలగంలో ఉన్న ఆయన విగ్రహం ముందు ఏర్పాటు చేసిన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇరకట్ల నాగభూషణం, కావలి సుకుమార్, పాల్ కొండయ్య తదితరులు నివాళి అర్పించారు.

రంజాన్ పండుగ ఎఫెక్ట్

● రూ.3 కోట్లకు జీవాల విక్రయాలు



సంతలో పాల్గొన్న వ్యాపారులు, రైతులు

పెరంబూర్, ఏప్రిల్ 5: విల్లుపురం జిల్లా సెంజిలో 150 ఏళ్ల నుంచి ప్రతి శుక్రవారం వారసంత జరుగుతోంది. ఈ సంతకు తేని, సేలం, కృష్ణగిరి, వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలు సహా ఆంధ్ర, కేరళ, పుదుచ్చేరి, కర్ణాటకకు చెందిన రైతులు తాము సంరక్షిస్తున్న గొర్రెలు, మేకలను విక్రయానికి తీసుకొస్తుంటారు. అలాగే, పొరుగు రాష్ట్రాల వ్యాపారులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొని వాటిని కొనుగోలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 11న రంజాన్ పండుగ రావడంతో శుక్రవారం రైతులు సుమారు 10,000కు పైగా జీవాలను సంతకు తీసుకొచ్చారు. రకాన్ని బట్టి రూ.7,000 నుంచి రూ.10,000 వరకు కొనుగోలు చేశారు. శుక్రవారం ఒకే రోజు సుమారు రూ.3 కోట్లకు పైగా విక్రయాలు జరిగాయి. అదే సమయంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉండడంతో పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచే వచ్చే వ్యాపారుల సంఖ్య తగ్గడంతో విక్రయాలు మందకొడిగా సాగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కూలిన హాస్టల్ పైకప్పు

ఐదుగురు విద్యార్థినులకు గాయాలు

పెరంబూర్, ఏప్రిల్ 5: హాస్టల్ పైకప్పు కూలి విద్యార్థినులు సహా ఆరుగురికి గాయాలయ్యాయి. దిండుగల్ జిల్లా పళని సమీపం ఆయక్కుడిలో ఆదిద్రావిడుల సంక్షేమ హాస్టల్ ఉంది. ఈ హాస్టల్‌లో శుక్రవారం ఉదయం విద్యార్థినులు అల్పాహారం కోసం వేచి ఉన్న సమయంలో హఠాత్తుగా పైకప్పు కూలింది. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థినులు, వంట మనిషి గాయపడ్డారు. వారిలో విద్యార్థిని, వంట మనిషి తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పైకప్పు శిథిలావస్థకు చేరిందని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు చేపట్టలేదని హాస్టల్ సిబ్బంది పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసుఉల కేసు నమోదు చేశారు.

చిరుత సంచారం

● 9 పాఠశాలలకు సెలవు



పబ్లిక్ పరీక్షా కేంద్రాల వద్ద సాయుధ పోలీసు భద్రత

పెరంబూర్, ఏప్రిల్ 5: మైలాడుదురై జిల్లాలో జనావాసాల్లో సంచరిస్తున్న చిరుతను బంధించేందుకు అటవీ సిబ్బంది శ్రమిస్తుండగా, ముందు జాగ్రత్త చర్యగా 9 పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. సెమ్మంగుళంలో చిరుత సంచరిస్తున్నట్లు ఈ నెల 2వ తేది అటవీశాఖ అధికారులకు ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించిన అధికారులు, చిరుత సంచరించినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో, గురువారం మళ్లీ ఆ ప్రాంతానికి వచ్చిన చిరుత, ఆ ప్రాంతంలో పందిపై దాడి చేసింది. అనంతరం చిరుత కోసం గాలించిన అధికారులు, అది ఆ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో, చిరుత సంచారం నేపథ్యంలో, గురువారం 7 పాఠశాలలకు సెలవు ప్రకటించగా, శుక్రవారం 9 పాఠశాలలకు సెలవు ప్రకటించారు. వీటిలో ఓ పాఠశాలలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో, ఆ పాఠశాల వద్ద సాయుధ పోలీసుల భద్రత కల్పించారు. కాగా, చిరుతను బంధించేందుకు 10 ప్రాంతాల్లో బోన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఖైదీ పరార్

● ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

ఐసిఎఫ్, ఏప్రిల్ 5: ఖైదీ పారిపోవడంతో ముగ్గురు సాయుధదళ పోలీసులు సస్పెన్షన్‌కు గురయ్యారు. కోయంబత్తూర్ సెంట్రల్ జైల్లో ఖైదీ లెనిన్ గురువారం పరారయ్యాడు. పోక్సో కేసులో కేరళలో ఉన్న కోర్టులో హాజరుపరచి తీసుకొస్తున్న సమయంలో తప్పించుకున్నాడు. ఈ వ్యవహారంలో కోయంబత్తూర్ సాయుధదళం పోలీసులు ధనశేఖర్, ప్రవీణ్, పవిన్ ని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

విద్యార్థినికి 'ఐ లవ్ యూ' చెప్పిన టీచర్

పెరంబూర్, ఏప్రిల్ 5: టెన్త్ విద్యార్థినికి ఉపాధ్యాయుడు 'ఐ లవ్ యూ' చెప్పిన వ్యవహారం ఉద్రిక్తతకు దారి తీసింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినికి ఉపాధ్యాయుడు 'ఐ లవ్ యూ' చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలపడంతో వారు తమ బంధువులతో కలసి పాఠశాలకు చేరుకొని, ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలని ముట్టడించారు. సమాచారం అందుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారితో చర్చలు జరిపి, విచారణ జరిపి చర్యలుచేపడతామని హామీఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కుమారుడు, కుమార్తెతో కలసి తల్లి ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 5: కోయంబత్తూర్ నంజుండాపురం సమీపం వెంకటాపురం రైలుమార్గంపై గురువారం మూడు మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారు చెన్నై అడయార్‌కు చెందిన వరలక్ష్మి(45), ఆమె కుమారుడు యువరాజ్(16), కుమార్తె జనని(15) అని తెలిసింది. ఆలయానికి వెళ్తున్నామని చెప్పి గురువారం ఉదయం పోదనూరు రైల్వేస్టేషన్‌కు చేరుకొని, అక్కడి సమీపంలోని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారని ప్రాథమికంగా నిర్ధారించారు. అలాగే, వీరి మృతికి గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

టాస్మాక్ ఉద్యోగి నుంచి రూ.4.48 లక్షల స్వాధీనం

ఐసిఎఫ్, ఏప్రిల్ 5: టాస్మాక్ ఉద్యోగి వద్ద రూ.4.48 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తంజావూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాల్లో ఓటర్లకు నగదు, బహుమతులు అందజేయడాన్ని అడ్డుకొనేలా పోలీసుల సహకారంతో ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, తంజావూరు వైద్యకళాశాల రోడ్డు ఫ్లై ఓవర్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. అటువైపు వచ్చిన ఓ కారును తనిఖీ చేయగా, రూ.4,48,480 నగదు ఉండడాన్ని గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. వడవూరు నైవాసల్ టాస్మాక్ మద్యం దుకాణంలో పని చేస్తున్నట్లు, వసూలైన నగదును ఇంటికి తీసుకెళ్తున్నట్లు అధికారులు తెలిపాడు. తగిన ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు ట్రెజరీలో అప్పగించారు.

సెంట్రల్, రాజా అన్నామలైపురంలలో...

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో తగిన రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.15 లక్షలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భువనేశ్వర్ నుంచి చెన్నై సెంట్రల్‌కు వచ్చిన వారాంతపు ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుల్లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ఉండడంతో అతని బ్యాగు తనిఖీ చేయగా అందులో రూ.15,80,000 నగదు ఉండడాన్ని గుర్తించారు. ఈ నగదుకు ఎలాంటి రసీదులు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... ఆ యువకుడు ఆంధ్ర రాష్ట్రం రాజమండ్రికి చెందిన కొల్లి వెంకటసత్యనారాయణ (53)గా గుర్తించి, అతన్ని విచారిస్తున్నారు. రాజా అన్నామలైపురం 3వ క్రాస్ స్ట్రీట్ వద్ద ఓ వ్యాన్‌లో తనిఖీ చేయగా రూ. కోటీ 86 లక్షలు బయల్పడ్డాయి. దానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఏమీ లేవు. అయితే ఆ నగదును ఏటీఎంలలో పెట్టేందుకు తీసుకెళ్తున్నట్లు వాహన సిబ్బంది తెలిపారు. దాంతో పోలీసులు ఆ నగదును స్వాధీనం చేసుకుని ఐటీ శాఖకు అప్పగించారు.

ఎన్నికల ప్రచారంలో జాతీయ పతాకం

● బీజేపీ అభ్యర్థిపై కేసు నమోదు

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రచారంలో జాతీయ పతాకం వినియోగించిన తిరువళ్లూర్ బీజేపీ అభ్యర్థి పొన్.బాలగణపతిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ నెల 3వ తేది ఊత్తుకోట సమీపం మెయ్యూరులో ఓ వృద్ధురాలు జాతీయ పతాకంతో ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై వెలగాపురం రెవెన్యూ అధికారి బాలాజి పెరియపాళయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బీజేపీ అభ్యర్థి సహా నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మదురై లోక్‌సభ నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ ఎస్.వెంకటేశన్ పోటీ చేస్తున్నారు. ఆయన మేలూరు సమీపం ఎం.వెల్లాలపట్టిలో ప్రచారం చేస్తున్న సమయంలో ఆయన్ను ఆహ్వానిస్తూ హారతి పట్టిన మహిళలకు నగదు అందించారనే సమాచారం. ఈ వ్యవహారంపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఫిర్యాదుతో కోడంబట్టి పోలీసులు, కేసు నమోదు చేశారు.

ఈసీఆర్‌లో కల్లు ముంతల ధ్వంసం

ప్యారీస్, ఏప్రిల్ 5: చెంగల్పట్టు జిల్లా ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఉన్న పలు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ విభాగం పోలీసులు తాటి, టెంకాయ చెట్లలో ఉన్న కల్లు ముంతలను ధ్వంసం చేశారు. మధురాంతకం సమీపంలోని సెయ్యూరు, తలుదాలికుప్పం, ఓడియూర్, కడపాక్కం తదితర గ్రామాల్లో వేలసంఖ్యలో తాటి చెట్లు ఉన్నాయి. జిల్లా ఎస్పీ కార్యాలయం ఆదేశాలతో పోలీసులు సంబంధిత గ్రామాలకు చేరుకొని, చట్టవిరుద్ధంగా చెట్లకు కట్టి ఉంచిన కల్లు ముంతలను ధ్వంసం చేశారు.

సైగలతో ఓట్లు అభ్యర్థించిన నటి ఖుష్బూ



సైగలతో ఓట్లు అభ్యర్థిస్తున్న నటి ఖుష్బూ

వేలూరు, ఏప్రిల్ 5: వేలూరు లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగంకు మద్దతుగా గురువారం రాత్రి నటి ఖుష్బూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రచార సమయం మించిన తర్వాత నగరానికి చేరుకున్న ఖుష్బూ, మాట్లాడకుండా కేవలం సైగలతో 'కమలం' గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు.

కారైక్కాల్ జిల్లా జాలర్ల నిరవధిక సమ్మె

● ఎన్నికల బహిష్కరణ

ప్యారీస్, ఏప్రిల్ 5: శ్రీలంక జైళ్లలో ఉన్న తమిళ జాలర్ల విడుదల, లంక నావికాదళం స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించాలని డిమాండ్ చేస్తూ కారైక్కాల్ జిల్లా జాలర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. తమకు న్యాయం జరగకుంటే లోక్‌సభ ఎన్నికలు బహిష్కరిస్తామని జాలర్ల సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే తమిళ జాలర్లను సరిహద్దులు దాటారని కారణం చూపి శ్రీలంక నావికాదళ సిబ్బంది తరచూ అరెస్ట్ చేస్తోంది. అంతేకాకుండా తమిళ జాలర్ల పడవలను కూడా వారు స్వాధీనం చేసుకుంటున్నారు. మత్స్యకారుల సంఘాల డిమాండ్‌తో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేపట్టే చర్యల వల్ల లంక జైళ్ల నుంచి తమిళ జాలర్లు విడుదలవుతున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న పడవలు మాత్రం వీరికి అప్పగించడం లేదు. ప్రస్తుతం ఆరు నెలలుగా శ్రీలంక జైలులో ఉన్న కారైక్కాల్ జిల్లాకు చెందిన ఇద్దరు జాలర్లను, వారి నాలుగు పడవలను విడిపించాన్న డిమాండ్ కారైక్కాల్ జిల్లా జాలర్ల సంఘం పిలుపు మేరకు సమ్మెలో జాలర్లు పాల్గొంటున్నారు.





టి.నగర్‌లో ఉన్న ఆంధ్రా క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్, వీహెచ్‌పీ సంయుక్త ప్రధాన కార్యదర్శి వి.కోటేశ్వరరావు 'అయోధ్య రామమందిర నిర్మాణ విశేషాలు' వివరించారు. వీహెచ్‌పీ, అయోధ్య రామమందిరం ట్రస్టు సంయుక్తంగా సంవత్సరాల తరబడి సమస్యాత్మకంగా ఉన్న బలరాముడి మందిరం అద్భుతంగా నిర్మించినప్పటి విశేషాలను ఆయన కళ్లకు కట్టినట్లు విశదీకరించారు. ఈ కార్యక్రమానికి పలువురు తెలుగు ప్రముఖులు హాజరై కోటేశ్వరరావును సత్కరించారు.


రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి భారతిరాజన్... ప్రచారంలో భాగంగా సెలూన్‌లో షేవింగ్ చేస్తున్న దృశ్యం



చెన్నై రాజధాని కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం వద్ద పోలీసుల బందోబస్తు


తూత్తుకుడి ప్రచారంలో పాల్గొన్న డీఎంకే అభ్యర్థి కనిమొళికి పావురం కానుకగా అందజేస్తున్న కార్యకర్తలు



మదురైలో మురిసేదెవరో?!

మొత్తం ఓటర్లు:	15,76,745
పురుషులు:	7,74,381
మహిళలు:	8.02.176
ఇతరులు:	188

ప్యారీస్, ఏప్రిల్ 5: మదురై పార్లమెంటు నియోజకవర్గం 1951-52లో ఏర్పడింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మీనాక్షి అమ్మవారి దేవస్థానం, చిత్తిరై వేడుకలకు పేరొందిన కళ్లలగర్ ఆలయం, గాంధీ మ్యూజియం, తిరుమలనాయకర్ ప్యాలెస్, పరవళ్లు తొక్కే వైగై నది, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలు, పాండ్య రాజుల రాజధాని, ప్రాచీన తమిళ సంఘం ఉన్న మదురై జిల్లా చరిత్ర ఘనం. అంతకంటే ప్రాధాన్యమైనది శివపరమాత్ముడు తన 64 లీలలను ప్రదర్శించిన పుణ్యక్షేత్రం మదురై కావడం విశేషం. రాజకీయపార్టీల మహానాడు, అలాగే చిత్రసీమకు సంబంధించిన విజయోత్సవాలకు కేంద్రం మదురై అన్న పేరు చరిత్రలో స్థిరపడింది.

అసెంబ్లీ నియోజకవర్గాలు...

మదురై లోక్‌సభ స్థానంలో మేలూరు, మదురై ఈస్ట్, మదురై వెస్ట్, మదురై సెంట్రల్, మదురై సౌత్, మదురై నార్త్ అనే 6 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.

జంట పార్లమెంటు సభ్యులు...

1951-52వ సంవత్సరంలో మదురై లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇద్దరు పార్లమెంటు సభ్యులు కలిగిన నియోజకవర్గంగా వ్యవహరించింది. అందులో జనరల్ కేటగిరీ నియోజకవర్గ ఎంపీగా బాలసుబ్రమణ్యం, రిజర్వ్ నియోజకవర్గ ఎంపీగా కక్కన్ కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

కాంగ్రెస్‌కు కంచు కోట...

మదురై పార్లమెంటు స్థానంలో అధిక విజయాలు సాధించింది కాంగ్రెస్ పార్టీయే. ఇక్కడ 8 సార్లు పోటీ చేసి భారీ మెజార్టీతో విజయాన్ని చేజిక్కించుకుంది. ద్వితీయ స్థానంలో సీపీఎం అభ్యర్థులున్నారు. 1998 ఎన్నికల్లో అప్పటి జనతా పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యస్వామి మదురై పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. 1999, 2004లో సీపీఎం తరఫున పోటీ చేసిన పి.మోహన్ ఎంపీ అయ్యారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే తరఫున ఆ పార్టీ అధినేత కుమారుడు ఎంకే అళగిరి ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలుగా చెలామణి అవుతున్న డీఎంకే, అన్నాడీఎంకే ఈ స్థానంలో తలా ఒకసారి మాత్రమే గెలవడం గమనార్హం.

అభివృద్ధికి నోచుకోని పరిశ్రమలు...

రాజధాని నగరం చెన్నై, కోయంబత్తూర్ తరువాత మెట్రో నగరంగా మదురై పేరొందింది. అయితే ఇక్కడ చెప్పుకోదగిన విధంగా పరిశ్రమలు లేవు. ఆలయాలకు కొరత లేని ఈ నగరంలో వినోదాన్ని పంచే అంశాలు కూడా అంతంత మాత్రమే. ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణం, మదురై విమానాశ్రయ విస్తరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదన్న విమర్శలున్నాయి. రైళ్ల సంఖ్య పెంచాలని, పరిశ్రమలను నెలకొల్పాలని, ఆధ్యాత్మిక కేంద్రాల్లో వసతులు మెరుగుపరచాలని స్థానికులు ఏళ్ల తరబడి కోరుతున్నారు. ఈ కోరిక అన్నింటినీ పరిష్కరింజేస్తామని హామీ ఇచ్చే పార్టీల అభ్యర్థులనే స్థానిక ఓటర్లు గెలిపించే పరిస్థితి నెలకొంది.

2019 ఎన్నికల ఫలితాలు...

ఈ లోక్‌సభ నియోజకవర్గానికి 2019లో జరిగిన ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన వెంకటేశన్ 4,57,075 ఓట్లతో విజయం సాధించారు. రాజ్‌సత్యన్ (అన్నాడీఎంకే)- 3,07,680 ఓట్లతో ద్వితీయస్థానంలో నిలిచారు. ఏఎంఎంకే, ఎన్టీకే, ఎంఎన్ఎం అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మదురై వెస్ట్, మేలూరు స్థానాలను అన్నాడీఎంకే దక్కించుకోగా, మిగతా 4 స్థానాల్లో డీఎంకే గెలిచింది.


ఎస్.వెంకటేశన్ (సీపీఎం)


శరవణన్ (అన్నాడీఎంకే)


ఆర్.శ్రీనివాసన్ (బీజేపీ)

ఆధిపత్యమెవరిదో? : డీఎంకే కూటమిలో రెండో సారి సీపీఎం తరఫున సిట్టింగ్ ఎంపీ ఎస్.వెంకటేశన్ పోటీలో ఉన్నారు. అన్నాడీఎంకే అభ్యర్థిగా డాక్టర్ శరవణన్, బీజేపీ తరఫున ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసన్ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ ముగ్గురు మధ్య గట్టి పోటీ నెలకొంది.


'ఓటే నా భవిష్యత్' అన్న నినాదంతో 100 శాతం పోలింగ్ అవగాహన ప్రచారంలో కళాశాల విద్యార్థులు

● తస్మాత్ జాగ్రత్త

ఫ్లయింగ్ స్క్వాడ్ అంటూ రూ.40 వేల మోసం

పెరంబూర్, ఏప్రిల్ 5: ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులమంటూ మోసానికి పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. స్థానిక మాధవరం జీఎస్టీ కాలనీకి చెందిన రవిచందర్‌జా పార్క్ టౌన్ సముద్ర మొదటి వీధిలోని మా గాయత్రి పరివార్ మందిర్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 29వ తేది రాత్రి రవిచందర్‌జా బైక్‌పై వ్యాసర్పాడి పొన్నప్పన్ వీధిలో వస్తుండగా, అక్కడ ఖాకీ దుస్తుల్లో ఉన్న ఇద్దరు పురుషులు, మహిళ అతన్ని అడ్డుకున్నారు. అతని బ్యాగ్ పరిశీలించగా రూ.40,000 ఉన్నాయి. తన తల్లి కంటి చికిత్స కోసం అప్పు తీసుకొస్తున్నానని రవిచందర్ చెప్పినా, తగిన దస్తావేజులు లేవంటూ వారు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని రవిచందర్ తన స్నేహితుడు సుభాష్‌శర్మతో చెప్పడంతో, ఆయన సూచన మేరకు గురువారం వ్యాసర్పాడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ప్రధాని రాకతో పెరిగిన డీఎంకే ఓటు శాతం

● మంత్రి శేఖర్‌బాబు

● ఎట్టెట్టా!

పెరంబూర్, ఏప్రిల్ 5: ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తున్న ప్రతి సారీ డీఎంకే ఓటు శాతం పెరుగుతోందని హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అన్నారు. స్థానిక తిరువికనగర్ నమ్మాళ్వార్‌పేటలో ఉత్తర చెన్నై డీఎంకే అభ్యర్థి కళానిధి మారన్‌కు మద్దతుగా మంత్రి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తుఫాను, వరదల సమయంలో ప్రజలను పలకరించని ప్రధాని మోదీ, లోక్‌సభ ఎన్నికల పుణ్యమా అని రెండు నెలల్లోనే 5 సార్లు రాష్ట్రంలో పర్యటించారన్నారు. ప్రధాని ఎన్ని సార్లు వచ్చినా అది డీఎంకేకు లాభమేనని అన్నారు. ప్రధాని రాష్ట్రానికి వచ్చిన ప్రతిసారి డీఎంకే ఓట్లు కనీసం 2 శాతానికి పెరుగుతున్నాయని అన్నారు. ఒకవేళ ప్రధాని రాష్ట్రంలోనే బస చేసినా బీజేపీ గెలిచే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.



● లెక్క తప్పిందే!

అభ్యర్థి లెక్క రూ.2 లక్షలు

● అధికారుల లెక్క రూ.22 లక్షలు

పెరంబూర్, ఏప్రిల్ 5: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ ప్రచారం, బహిరంగ సభల నిర్వహణ, కార్యకర్తలకు అందించే భోజనాలు, కరపత్రాల ముద్రణ, వాహనాల్లో లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రచారం తదితరాల ఖర్చుల వివరాలు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి ఉంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే అభ్యర్థులు చేసే వ్యయం లెక్కించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకోసం ఎన్నికల వ్యయ పరిశీలకులను కూడా ఎన్నికల కమిషన్ నియమించింది. వీరు సదరు అభ్యర్థి వెంటే ఉంటూ లెక్కలు గణిస్తుంటారు. అదే సమయంలో అభ్యర్థులు ప్రచారం కోసం వెచ్చించే కరపత్రాలు, కార్యకర్తలకు అందించే టీ, కాఫీ, మజ్జిగ, భోజనాలు తదితరాలకు ఎన్నికల కమిషన్ ధరలు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తొలి ఎన్నికల వ్యయం లెక్కలు ఈ నెల 2వ తేది లోపు సమర్పించాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది.

అభ్యర్థి ఖర్చు రూ.2 లక్షలు...

కాంచీపురం (రిజర్వుడు) నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీ చేస్తున్న సెల్వం తరఫున గత నెల 26 నుంచి 30వ తేది వరకు ఎన్నికల వ్యయాన్ని ఈసీకి అందజేశారు. అందులో ప్రచారానికి రూ.1.99 లక్షలు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. కానీ, అభ్యర్థి ఎన్నికల ప్రచారాన్ని స్వయంగా పర్యవేక్షించడంతో పాటు వాటిని వీడియోగా నమోదు చేసిన అధికారులు, అభ్యర్థి పెట్టిన వ్యయం రూ.22 లక్షలుగా నిర్ధారించారు. ఈ మేరకు ఎన్నికల వ్యయ పరిశీలకులు మధుకర్‌ఆవేస్ వ్యయ ఖర్చులతో కూడిన నివేదికలో పేర్కొన్నారు. అలాగే, అన్నాడీఎంకే అభ్యర్థి రాజశేఖర్ తరఫున ఎన్నికల వ్యయం రూ.11.11 లక్షలు చూపగా, అధికారుల లెక్కల ప్రకారం రూ.17.83 లక్షలుగా ఉంది. ఇక, పీఎంకే అభ్యర్థి జ్యోతి తరఫున ఎన్నికల వ్యయం రూ.7.44 లక్షలు చూపగా, అధికారుల లెక్కల ప్రకారం రూర.9 లక్షలుగా ఉంది. అదే సమయంలో, ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థులు, తాము ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని లెక్కలు దాఖలు చేశారు.

విజయం మాదే

సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి మనోజ్ పి.సెల్వం


మనోజ్‌ను సత్కరిస్తున్న స్థానికులు

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తనదే విజయమని సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తిరువీధి అమ్మన్ 1, 2, 3 వీధులు, కదిరవన్ కాలనీ రోడ్, గజలక్ష్మి కాలనీ, అయపూ వీధి, గజపతి వీధి, చెల్లమ్మాళ్ వీధి, ఎల్‌టీ రోడ్, నాదముని, దేవకియమ్మాళ్, కాన్వెంట్, చెల్లమ్మాళ్, గజపతి వీధి, బ్రేవరీ రోడ్, ఆర్‌వీ నగర్ మెయిన్‌రోడ్, భరత్ ప్లాట్స్, అరుముగం వీధి, గాంధీ రోడ్, వీవోసీ మెయిన్ రోడ్, మండపం రోడ్, న్యూ ఆవడి రోడ్, ఔటర్ సర్కిల్, కేజీ రోడ్, అన్నానగర్ రస్ట్ మండల్ తదితర ప్రాంతాల్లో ముమ్మర ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ని గజమాలతో సత్కరించడంతో పాటు దుశ్శాలువలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఓట్లు అభ్యర్థించిన మనోజ్ మాట్లాడుతూ... గతానికి భిన్నంగా ప్రజల నుంచి తమ పార్టీకి స్పందన లభిస్తోందని, ఈ అపూర్వ ఆదరణ తమ ప్రత్యర్థులను సైతం బెంబేలెత్తిస్తోందని పేర్కొన్నారు. ఇది మోదీ పాలనకు ప్రజల నుంచి వస్తున్న స్పందనగా భావిస్తున్నామన్నారు. తనను గెలిపిస్తే స్థానిక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు కేంద్రప్రభుత్వం నుంచి భారీగా నిధులు రప్పించి, నియోజకవర్గంలో అభివృద్ధి చేపడతానని హామీ ఇచ్చారు. వంతుల వారీగా ద్రావిడ పార్టీలను గెలిపించిన ప్రజలు ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.


చెప్పుల దండతో ప్రచారం చేస్తున్న అరసన్

చెప్పుల దండతో స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

● ఎవరేమనుకుంటే నాకేం

ప్యారీస్, ఏప్రిల్ 5: విల్లుపురం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి అరసన్ ఎన్నికల సంఘం ఆయనకు గుర్తుగా 'చెప్పులు' కేటాయించింది. ఆయన తన అనుచరులతో కలసి చెప్పుల దండ మెడలో ధరించి నగరంలో తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కాళ్ల కింద అరిగిపోయే వరకు చెప్పులు ఎలా సాయం చేస్తాయో, అదే విధంగా తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజా సేవకే తన జీవితం అంకితం చేస్తానంటూ హామీ ఇస్తున్నారు. కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలోని పాండూరుకి చెందిన అరసన్ స్థానిక సంస్థలు, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో గత 30 ఏళ్లుగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తుండడం గమనార్హం.

వధూవరుల వద్ద ఓట్లు అభ్యర్థించిన తంగర్ బచ్చన్

● ఎవ్వరినీ వదలరుగా

పెరంబూర్, ఏప్రిల్ 5: కడలూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమిలో పీఎంకే అభ్యర్థిగా సినీ దర్శకుడు తంగర్ బచ్చన్ పోటీ చేస్తున్నారు. తిరువందిపురంలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టిన సమయంలో, అక్కడున్న కల్యాణ మండపంలో వివాహం చేసుకున్న వధూవరులు బయటకు వచ్చారు. వీరిని గమనించిన తంగర్ బచ్చన్ వెంటనే వారి వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన, 10 కార్లు, 10 బంగళాలున్నా సంతోషంగా జీవించలేరు. ఒకరినొకరు అర్థం చేసుకొని సుఖంగా జీవించాలని ఆశీర్వదించారు. అనంతరం మీ కోసం, మీకు పుట్టబోయే పిల్లల భవిష్యత్తు తాను తాను పోటీ చేస్తున్నానని, 'మామిడి పండు' గుర్తుకు ఓటు వేయాలంటూ కరపత్రాలు అందజేశారు.


వధూవరులను ఆశీర్వదిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న తంగర్ బచ్చన్

ఏడడుగుల కుండతో ప్రచార వాహనం

పెరంబూర్, ఏప్రిల్ 5: 'ఇండియా' కూటమిలో డీపీఐ అభ్యర్థులు చిదంబరం, విల్లుపురం నియోజకవర్గాల్లో 'కుండ' గుర్తుపై పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారంలో గుర్తు ప్రజల్లోకి వెళ్లేలా భారీ కుండలతో ప్రచార వాహనాలు ఏర్పాటయ్యాయి. పుదుచ్చేరికి చెందిన డీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఏకాంబరం వాటిని సమకూర్చారు. నలుగురు కళాకారులు రాత్రింబవళ్లు శ్రమించి ఫైబర్‌తో 7 అడుగుల ఎత్తు, 6 అడుగుల వెడల్పుతో ఆరు భారీ కుండలు తీర్చిదిద్దారు. ఈ కుండలను ప్రచార వాహనంపై ఉంచి చిదంబరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఆరు శాసనసభ నియోజకవర్గాలకు తలా ఒకటి చొప్పున పంపించారు. కాగా, ఈ వాహనాలు విల్లుపురంలో పోటీ చేస్తున్న డీపీఐ అభ్యర్థి రవికుమార్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటాయని పార్టీ తెలిపింది.


భారీ కుండతో ప్రచార వాహనం

పరోటా మెత్తగా ఉండాలి సామీ

● విరుదునగర్‌లో పరోటాలు కాల్చిన రాజేంద్ర బాలాజీ, విజయ్ ప్రభాకరన్

● ఓట్ల కోసం పాట్లు

పెరంబూర్, ఏప్రిల్ 5: విరుదునగర్ లోక్‌సభ నియోకవర్గంలో అన్నాడీఎంకే కూటమి తరఫున డీఎండీకే అభ్యర్థిగా విజయ్ ప్రభాకరన్ పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా అన్నాడీఎంకే మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ శివకాశిలో ప్రచారం చేపట్టారు. తొలుత ముత్తురామలింగ దేవర్ విగ్రహానికి నివాళి అర్పించిన నేతలు వీధి ప్రచారంలో పాల్గొన్నారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలోని ఓ హోటల్‌లో ఓట్లు అభ్యర్థించారు. అనంతరం రాజేంద్ర బాలాజీ, విజయ్ ప్రభాకరన్ హఠాత్తుగా వంట మాస్టర్ అవతారం ఎత్తారు. పొయ్యివద్ద కెళ్లి గరిటె చేతబట్టి పరోటాలు కాల్చారు. అనంతరం ఆ పరోటాలను అభ్యర్థి విజయ్ ప్రభాకరన్ కార్యకర్తలకు అందజేశారు. పరోటాలు గట్టిగా ఉన్నాయని, కొంచెం మెత్తగా ఉంటే బాగుండేదని కార్యకర్తలు గుసగుసలాడుకున్నారు.


పరోటాలు కాలుస్తున్న మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ

పండ్లు, కూరగాయలతో ఓటు హక్కుపై అవగాహన

తేని లోక్‌సభ నియోజకవర్గం అల్లినగరంలో 100 శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన ప్రచారం కొనసాగుతోంది. అల్లినగరం రైతు బజార్‌కు చెందిన పండ్లు, కూరగాయల వ్యాపారుల సంఘం తరఫున ఓటు హక్కు వినియోగంపై కళాకారులు పుచ్చకాయలు, ద్రాక్ష సహా పలు పండ్లపై చేపట్టిన ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంటోంది. - ప్యారీస్



ద్రాక్ష, బత్తాయి, కమల పండ్లతో 100 శాతం ఓటింగ్ అంటూ రూపొందించిన దృశ్యాలు - పుచ్చకాయలపై ఓటు అవగాహన ప్రచారం


'ఇండియన్-2'లో కమల్ హాసన్

'ఇండియన్-2' రిలీజ్ డేట్ ఫిక్స్!

శంకర్ దర్శకత్వంలో కమలహాసన్ నటిస్తున్న తాజా చిత్రం 'ఇండియన్-2'. కొన్నేళ్లుగా చిత్రీకరణ జరుపుకుంటూ వచ్చిన ఈ సినిమా ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. సమ్మర్ స్పెషల్‌గా మే 24న ఈ చిత్రం విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.1996లో వచ్చిన 'ఇండియన్'కి ఇది సీక్వెల్. ఇందులో కమల్‌తో పాటు కాజల్ అగర్వాల్,రకుల్ ప్రీత్ సింగ్,సిద్ధార్థ్, సముద్రగని, బాబీ సింహా వంటి పలువురు నటించారు. ఈ మూవీ తొలి భాగానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించగా, రెండో భాగానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీత స్వరాలు సమకూర్చారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని తుది దశ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేసుకున్న ఈ మూవీని సమ్మర్ స్పెషల్‌గా తమిళం, తెలుగు, హిందీ, కన్నడం భాషల్లో మే 24న విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు. నిజానికి ముందుగానే రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కానీ, ఈ నెల 19వ తేదీన రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. అలాగే, పొరుగు రాష్ట్రాల్లో మే లో రెండో దశ పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత విడుదల చేయాలని భావిస్తున్నారు. అయితే, ఈ విడుదల తేదీపై నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్‌తో పాటు రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మించాయి.

మద్యపానం నేపథ్యంలో 'ఆలకాలం'

జయకృష్ణమూర్తి, చాందిని, ఈశ్వరీరావు, దీపా శంకర్ ప్రధాన పాత్రల్లో 'ఆలకాలం' చిత్రం మద్యపానం ఇతివృత్తంతో సాగుతుంది. మద్యపానం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలుగుతుంది, కుటుంబాలు ఏ విధంగా చిన్నాభిన్నమైపోతాయన్న కథాంశంతో గతంలో అనేక సినిమాలు వచ్చాయి. కానీ, వీటికి భిన్నంగా వైవిధ్యభరితమైన కథాంశంలో ఈ సినిమాను దర్శకుడు జయకృష్ణమూర్తి తెరకెక్కించారు. శ్రీ జయ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రానికి సంగీతం ఎన్.ఆర్.రఘునందన్. అనేక చిత్రాల్లో మద్యపానం సేవించడాన్ని ఒక వినోదాంశంగా చూపిస్తుంటారు. అయితే ఈ సినిమాలో మద్యం మనిషిని ఎంతటి స్థాయికి దిగజార్చుతుందనే విషయాన్ని దర్శకుడు కళ్లకు కట్టినట్టు వివరించారు. హీరోయిన్ చాందిని కాలేజీ విద్యార్థినిగా పాత్రలో ఒదిగిపోయారు. సీనియర్ నటి ఈశ్వరీ రావు పాత్ర, నటన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరో తల్లిగా అద్భుతంగా నటించారు. మద్యానికి బానిసై తన భర్తను కోల్పోయిన ఆమె.. కుమారుడు కూడా అదే మద్యానికి బానిస కావడాన్ని జీర్ణించుకోలేక, తిరిగి మామూలు మనిషిని చేసేందుకు ఆమె పడే తపన ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టించేలా ఉంటుంది. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది.


'ఆలకాలం'లో జయకృష్ణమూర్తి - చాందిని

చిత్రజ్యోతి

దుషార విజయన్‌కు లక్కీ ఛాన్స్!

కోలీవుడ్ యంగ్ హీరోయిన్ దుషార విజయన్‌కు లక్కీఛాన్స్ వరించింది. చియాన్ విక్రమ్ నటించే 62వ చిత్రంలో ఆమెకు అవకాశం లభించింది. హెచ్‌ఆర్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత రియా షిబు నిర్మించే ఈ చిత్రానికి సు.అరుణ్ కుమార్ దర్శకుడు. మ్యూజిక్ జీవీ ప్రకాష్ కుమార్. ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన ఇటీవలవిడుదలైంది. ఈ నేపథ్యంలో ఇందులో నటించే నటీనటుల వివరాలను ఒక్కొరిగా ప్రకటిస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఎస్‌జే సూర్య, సూరజ్‌ను ఎంపిక చేయగా తాజాగా దుషార విజయ్‌ను ఆన్‌బోర్డులోకి తీసుకున్నారు. గతంలో ఆర్య నటించిన 'సర్పాట్టా పరంపరై' చిత్రంలో మారియమ్మాళ్ పాత్రలో జీవించిన దుషార విజయన్‌కు మంచి పేరుతో గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత వరుస సినిమాల్లో నటిస్తున్నారు. ఈ క్రమంలోనే సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'వేట్టయ్యన్' చిత్రంలో దుషార నటిస్తుండగా తాజాగా విక్రమ్ మూవీలో అవకాశాన్ని దక్కించుకున్నారు.

